ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
సోమవారం
01 డిసెంబర్ 2025

డ్రామాలొద్దు.. టిప్స్ ఇస్తా రండి:విపక్షాలకు మోదీ చురకలుల

డిసెంబర్ 1, (రిపబ్లిక్ న్యూస్): దేశాభివృద్ధి కోసం విపక్షాలు ప్రభుత్వంతో కలిసి రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. పరాజయాన్ని అంగీకరించే మనసు ప్రతిపక్షాలకు లేదని దుయ్యబట్టారు. సభా సమయాల్లో డ్రామాలు వద్దని, చట్టసభల్లో చర్చలు తప్పనిసరని హితవు పలికారు. సోమవారం శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మీడియాతో మాట్లాడారు."ఈ పార్లమెంట్ సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని చట్టసభ సభ్యులను విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి. చట్టసభల్లో డ్రామాలు వద్దు. సానుకూల వాతావరణంలో చర్చలు జరగాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగలవద్దని కోరుతున్నాను. విపక్షాలు ఓటమి నిరాశను అధిగమించాలి. అవి తమ బాధ్యతను నిర్వర్తించాలి. బలమైన అంశాలను లేవనెత్తాలి" అని మోదీ సూచించారు. "గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. వారికి కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని ప్రధాని విపక్షాలకు చురకలంటించారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని వెల్లడించారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈసారి పార్లమెంట్ సెషన్ కూడా దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు బాటలు పరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

శ్రీకాకుళం జిల్లాలో వర్షాలు..

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి అచ్చెన్న

శ్రీకాకుళం, డిసెంబర్ 1, (రిపబ్లిక్ న్యూస్): దిత్వా తుపాను ప్రభావంతో తెల్లవారుజాము నుంచి శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, జలుమూరు, నరసన్నపేట, పోలాకి, ఎల్ఎన్పేట, హిందూపురం, జి.సిగడాం మండలాల్లో తేలికపాటి జల్లులు పడుతున్నాయి. కల్లాల్లో ఎక్కడికక్కడ ధాన్యం రాశులు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిత్వా తుపాను దృష్ట్యా అధికారులను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

హిల్ట్ పాలసీపై.. గవర్నర్‌కు భాజపా నేతల ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబర్ 1, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్ను కలిసింది. హిల్ట్ పాలసీ పేరుతో రూ. వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని ఫిర్యాదు చేసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. "హిల్ట్ పాలసీ ద్వారా అక్రమాలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 9 వేల ఎకరాలను రియల్ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్నిస్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చి చూస్తే అక్రమాలు తెలుస్తున్నాయి. కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జీహెచ్ఎంసీ విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయి" అని నేతలు ఆరోపించారు.

డ్రామా అంటే అది:ప్రధాని మోదీ వ్యాఖ్యలపై

స్పందించిన ప్రియాంకా గాంధీ

డిసెంబర్ 1, (రిపబ్లిక్ న్యూస్): చట్టసభల్లో డ్రామాలొద్దని, టిప్స్ ఇస్తానంటూ ప్రధాని మోదీ విసిరిన వ్యంగ్యాస్త్రాలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. సమావేశాల్లో భాగంగా ప్రత్యేక సమగ్రసవరణ (సర్), దిల్లీ కాలుష్యం వంటి తీవ్రమైన అంశాలను లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు."ఎన్నికల నిర్వహణలో అవకతవకలు, ఎస్ఐర్, కాలుష్యం వంటివి తీవ్రమైన అంశాలు. వాటిని చర్చిద్దాం.

ఈ అంశాలపై చర్చ లేకపోతే పార్లమెంట్ దేనికి..? వాటి గురించి మాట్లాడటమేమీ డ్రామా కాదు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అంటే" అని మోదీ విమర్శలకు ప్రియాంక బదులిచ్చారు. ప్రధాని మోదీ పార్లమెంట్ వేదికగా ప్రజాసమస్యలపై చర్చించడానికి బదులు మరోసారి నాటకీయ ప్రసంగం చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటుందన్నారు. సోమవారం శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోదీ మీడియా మాట్లాడారు. ఆ సందర్భంగా విపక్షాలకు చురకలు పెట్టారు. "కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి. చట్టసభల్లో డ్రామాలు వద్దు. సానుకూల వాతావరణంలో చర్చలు జరగాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగలవద్దని కోరుతున్నాను. విపక్షాలు ఓటమి నిరాశను అధిగమించాలి. గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. వారికి కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని ఎద్దేవా చేశారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

సినిమాలను అలా అంచనా వేయడం దురదృష్టకరం:ఆమిర్ ఖాన్

బాక్సాఫీస్ నంబర్ల ఆధారంగా సినిమా ఫలితాన్ని అంచనా వేయడం దురదృష్టకరమని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ అన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని, ఇప్పుడు ఆ నంబర్లకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు సినిమాల్లోని సన్నివేశాలు, పాటల ఆధారంగా బాగుందా లేదా? అని నిర్ణయించేవారని గుర్తుచేశారు. "బాక్సాఫీస్ నంబర్ల విషయంలో దర్శకనిర్మాతలు పారదర్శకత పాటించాలి. ఎన్ని స్క్రీన్లలో రిలీజ్ చేశారు.. ఎంత కలెక్షన్లు వచ్చాయనే ప్రతి విషయం ప్రేక్షకులకు తెలియాలి. విదేశాల్లో అలాంటి పద్ధతే ఉంది. గతంలో నేను వీటి గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ, ఇప్పుడు ప్రేక్షకులకు దీనిపై ఆసక్తి పెరిగింది కాబట్టి నేను కూడా ఆలోచిస్తున్నా. నంబర్ల ఆధారంగా సినిమా ఫలితాలను అంచనా వేయడం మాత్రం దురదృష్టకరం. అంచనాలు ఎలా ఉన్నప్పటికీ మంచి సినిమాలను మాత్రమే ప్రేక్షకులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు" అని ఆమిర్ స్పష్టం చేశారు. ఇక ఇటీవల మరణించిన బాలీవుడ్ హీరో ధర్మేంద్రతో ఉన్న అనుబంధాన్ని ఆమిర్ గుర్తుచేసుకున్నారు. ఆయనను కలవడం తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని క్షణమని చెప్పారు. తన చిన్న కుమారుడిని కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. తన సినిమాల ఎంపికల గురించి ఆమిర్ మాట్లాడుతూ.. "నాకు బాల్యం నుంచే కథల పట్ల ఆసక్తి ఎక్కువ. అదే నన్ను మంచి సినిమాల దిశగా నడిపించింది. ఈ రోజుల్లో చాలా మంది తదుపరి ఏమి తీయాలి.. మార్కెట్లో ఏ సినిమాలు నడుస్తున్నాయి అని ఆలోచిస్తున్నారు. కానీ నేను ఎప్పుడూ ట్రెండ్ను దృష్టిలో పెట్టుకొని కథల్ని ఎంపిక చేసుకోలేదు" అని తెలిపారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

హర్షిత్ రాణా వికెట్లు కూల్చడమూ మేలు చేసింది:టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్

టీం ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్.. ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాను ప్రశంసించాడు. రాంచి వన్డేలో అతడు త్వరత్వరగా రెండు వికెట్లు కూల్చడం టీమ్ ఇండియాకు కలిసొచ్చిందన్నాడు. లేదంటే దక్షిణాఫ్రికా 350 పరుగుల లక్ష్యాన్ని కూడా తేలికగా ఛేదించి ఉండేదని అతడు అభిప్రాయపడ్డాడు. "డ్యూ వల్ల బౌలర్లు బంతిపై సరిగా పట్టు సాధించలేరు. బాల్ పిచ్ మీద స్కిడ్ అయి బ్యాట్ మీదకు వస్తుంది. అలాంటప్పుడు బ్యాటర్లు తేలికగా పరుగులు చేయగలరు. నిన్నటి మ్యాచ్లో హర్షిత్ రాణాను ఎంత పొగిడినా తక్కువే. అతడు మ్యాచ్ ఆరంభంలో త్వరత్వరగా రెండు వికెట్లు తీసుకున్నాడు. కూకబుర్రా బంతి మొదటి అయిదు ఓవర్లు బాగా స్వింగ్ అవుతుంది. దాన్ని హర్షిత్ చక్కగా ఉపయోగించుకున్నాడు. సరైన లైన్ అండ్ లెన్త్తో బంతుల్ని సంధించి, ఫలితాన్ని రాబట్టాడు. లేదంటే దక్షిణాఫ్రికా బ్యాటర్లు డ్యూ వల్ల తేలికగా పరుగులు చేసి ఉండేవారు" అని సితాన్షు కొటక్ తెలిపాడు. ఈ మ్యాచ్లో హర్షిత్ రాణా ర్యాన్ రికెల్టన్ (0), క్వింటన్ డికాక్ (0) ఇద్దరినీ ఖాతా తెరవకుండానే పెవిలియన్కు పంపాడు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 7 పరుగుల వద్ద 2 వికెట్లు కోల్పోయింది. ఒకనొక దశలో 77/4తో దక్షిణాఫ్రికా జట్టు పీకల్లోతు కష్టాల్లో కనిపించింది. మ్యాథ్యూ బ్రీట్కే (72), మార్కో యాన్సన్ (70), కోర్బిన్ బోష్ (67) రాణించి విజయంపై ఆశలు రేకెత్తించారు. కానీ కుల్దీప్ యాదవ్ (68/4) మిడిల్ ఓవర్లలో బంతితో విజృంభించి సఫారీలను కట్టడి చేశాడు. దీంతో 49.2 ఓవరల్లో దక్షిణాఫ్రికా 332 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్లో టీమ్ ఇండియా 17 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

ఇంటి చిట్కాలు

మొక్కలు వాడిపోకుండా ఎండల నుంచి కాపాడే సహజ ఎరువులు, ఇంట్లోనే సులభంగా చేసుకోవచ్చు ఎలాగంటే

ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం.

వేసవి కాలం రాబోతుంది. ఇప్పటికే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలకి మనుషులే కాదు మొక్కలు కూడా అల్లాడిపోతాయి. ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం. మొక్కలకి చల్లదనాన్ని ఇవ్వడానికి కొన్ని ఎరువులు సాయపడతాయి. ఈ ఎరువుల వల్ల మొక్కలు పోషకాలతో పాటు చల్లదనాన్ని కూడా పొందుతాయి. వేసవిలో, ఎక్కువగా ద్రవ ఎరువులను వాడాలి. వీటిలో నత్రజని, కాల్షియం, సల్ఫర్, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి మొక్కలకు మంచి పోషణను అందిస్తాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల మొక్కలు ఎండిపోవు. అలాంటి నాలుగు ఎరువులు ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.

ఆవు పేడ ఎరువు

సులభంగా లభించే ఎరువులలో ముందుగా గుర్తుకు వచ్చే పేరు ఆవు పేడ. ఇది ఇంటి తోటపనికి బాగా పనికివస్తుంది. అంతేకాకుండా సులభంగా లభిస్తుంది. దీనిని తయారు చేయడానికి, ఆవు పేడ పిడకల్ని ఒక బకెట్ నీటిలో వేసి, మూతపెట్టి 3 రోజులు అలాగే ఉంచండి. 3 రోజుల తర్వాత, దానిని మరొక పాత్రలోకి వడకట్టండి. ఈ మిశ్రమాన్ని ప్రతి 2 నుంచి 3 రోజులకు ఒకసారి మొక్క మట్టిలో కలపండి. మీరు కావాలనుకుంటే దీనిని ద్రవ ఎరువుగా ఉపయోగించవచ్చు.

మజ్జిగతో ఎరువు

పెరుగును బాగా చిలికి వెన్న తీసిన తర్వాత మిగిలిన మజ్జిగను కూడా మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఇంట్లో తయారుచేసిన మజ్జిగను ప్లాస్టిక్ బకెట్లో నింపండి. ఆ తర్వాత దాని ఓ మూత పెట్టి పది రోజులు అలానే ఉంచండి. ఈ సమయంలో మజ్జిగ బాగా పులిసిపోతాయి. ఆ తర్వాత ఒక లీటర్ నీటిలో 200 మి.లీ మజ్జిగను కలపండి. బాగా కలిపిన తర్వాత ఈ మిశ్రమాన్ని 500 మి.లీ చొప్పును మొక్కకు పోయాలి. ఈ మిశ్రమం వల్ల మొక్కకు చల్లదనంతో పాటు పోషకాలు కూడా బాగా అందుతాయి.

వేప పిండి

వేప పిండిని కూడా చల్లని ఎరువుగా మొక్కలకు ఉపయోగించవచ్చు. నిజానికి వేప పిండి మొక్కలో నత్రజని లభ్యతను పెంచుతుంది. దీనిని ఉపయోగించడానికి ముందుగా 50% తోట మట్టి, 30% ఆవు పేడ ఎరువు, 20% వేప పిండి మిశ్రమాన్ని బాగా కలపండి. ఇప్పుడు దానిపై తేలికగా నీళ్లు చల్లండి. ఆ తర్వాత దీనిని మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. మొక్కలో మట్టిలో ఈ మిశ్రమాన్ని కలిపితే సరిపోతుంది.

ఎండిన ఆకుల కంపోస్ట్

చెట్లు, మొక్కల నుంచి ఎండిన ఆకులు రాలి కింద పడతాయి. ఇలాంటి ఆకుల్ని చెత్తగా పారేసే బదులు మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. వీటిని సేంద్రీయ ఎరువులు అంటారు. ఇది నేలను సారవంతం చేయడానికి పనిచేస్తుంది. ఇది గరిష్టంగా నీటిని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. వేసవిలో మొక్కల వేర్లను చల్లగా ఉంచడానికి దీనిని ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఎండిన ఆకుల్ని తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక బక్కెట్లోకి తీసుకోండి. వీటిపై కొంచెం నీళ్లు చల్లండి. ఆ తర్వాత మూతపెట్టి కొన్ని రోజులు అలాగే ఉంచండి. మధ్యమధ్యలో మూత తీసి బాగా కలిపి నీళ్లు చల్లుతూ ఉండండి. కొన్ని రోజుల తర్వాత ఎరువు సిద్ధంగా ఉంటుంది. ఒక మొక్కకు గుప్పెడు ఎరువు తీసుకుని మొదళ్లలో చల్లండి. ఆపై తేలికగా నీరు పెట్టండి. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది అవి ఎండిపోవు.

ఉల్లిపొట్టు

ఉల్లి పొట్టు కూడా మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. మొక్కలు ఎండిపోకుండా నివారించడంలో ఉల్లిపొట్టు కీలక పాత్ర పోషిస్తుంది. ఉల్లి పొట్టును అలా మొక్కల పొదల్లో వేసినా సరిపోతుంది. లేదంటే.. ఐదు లీటర్ల గోరు వెచ్చని వాటర్లో ఓ ఇరవై నుంచి ముప్పై గ్రాముల ఉల్లిపొట్టుని వేసి నాలుగు రోజుల పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ వేస్తే.. అవి ఎండిపోకుండా బాగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

గమనిక

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. ఈ విషయాల్ని సమయం తెలుగు ధృవీకరించడం లేదు.